
## జర్నలిస్ట్ కథలు



# కర్ఫ్యూ పండుగ

జొన్నలగడ్డ రాధాకృష్ణ

"బాబరీ మసీదు పడగొట్టడాన్ని నేను తీవ్రంగా గర్హిస్తున్నాను" అన్నాడు త్రయంబకం ఎలుగెత్తి.

"అదేవిటి సార్ మసీదుని పడగొడితే ఈయన గర్విస్తున్నానంటాడు. కొట్టరా సార్?" అన్నాడు సబ్ రిపోర్టర్ కమలనాథం.

"గర్వించడం కాదయ్యా. గర్హించడం. అంటే ఖండించడం అన్నమాట"— అని వివరించాడు న్యూస్ఎడిటర్ సుబ్బారావు ఓపిగ్గా.

అంతలో ఓ ఘోరం జరిగిపోయింది.

త్రయంబకం ఏదో గర్హిస్తున్నానంటే అందరూ లైట్ గా తీసుకున్నారు గానీ అతగాడు ఎడిటోరియల్ రాసి పడేశాడు. పైగా ఫస్టు పేజీలో పెట్టా అన్నాడు.

సుబ్బారావు ఆ ఎడిటోరియల్ చదివి తల బాదుకున్నాడు.

ఒక్క ముక్క అర్థం కాలేదు.

మసీదు పగలగొట్టడం కన్నా ఎడిటోరియల్ ఎక్కువ బాధపెట్టేట్టుంది ప్రజల్ని.

చివర్న బాబరీ మసీదు మళ్ళీ కట్టాలని రాశాడు.

"బాబరీ మసీదు మళ్ళీ ఎలా కడతారు సార్? ఇప్పుడు బాబర్ లేదుగా" అన్నాడు కమలనాథం.

అంతలో రూములోంచి బయటకొచ్చిన త్రయంబకం — "ఎందుకు కట్టలేరు? ఇవాళ బాబర్ లేకపోతే పీవీ నరసింహారావున్నాడుగా ఆయన కట్టాలి. అదే బాబరీ మసీదు అయిపోతుంది" అన్నాడు.

"అలా ఎలా అవుతుంది సార్! పీవీ నరసింహారావు కడితే పీవీ మసీదవుతుంది కదా?" అన్నాడు కమలనాథం.

"కాదు బాబరీ మసీదే అవుతుంది. ఇలాంటివి అర్థం కావాలంటే నీకు అనుభవం చాలదు" అని వెళ్ళిపోయాడు త్రయంబకం.

"అదేవిటిసార్! పెద్దాయన అలా అంటాడు — బాబరీ మసీదు ఎవళ్ళు పడితే వాళ్ళు ఎలా కట్టగలుగుతారు సార్?" అన్నాడు కమలనాథం ఆశ్చర్యంగా.

సుబ్బారావు నిశితంగా ఆలోచించాడు. అనుభవం లేకపోయినా కమలనాథం చెప్పింది కరెక్టే అనిపించింది. ఇప్పుడు ఏదో ఓ మసీదు కట్టచ్చు గానీ బాబరీ మసీదు ఎలా కట్టగలరు— బాబర్ లేకుండా?

అంతలో సదావివారం వొచ్చాడు వొస్తూ వొస్తూనే గొల్లున ఏడుస్తున్నాడు.

సుబ్బారావు కంగారు పడిపోయాడు.

ఈ సదావివారం గాడు ఎప్పుడూ దేనికో ఓ దానికి ఏడుస్తూ వుంటాడు. అది అతడి హాబీ. అయితే ఇప్పుడు లేటెస్ట్ గా వాడికేం కష్టం వచ్చిందో అర్థం కాలేదు.

ఓ అరగంట ఏడిచాక చెప్పాడు బాబరీ మసీదు కూల్చినందుకు, దేశంలో లౌకిక వ్యవస్థ చావు దెబ్బతిన్నందుకు వాడు విచారిస్తున్నట్టు పేపర్లో స్టేట్ మెంట్ వెయ్యాలిట.

"విచారిస్తున్నట్టు స్టేట్ మెంట్ వెయ్యడానికి ఇలా ప్రాక్టికల్ గా గుక్క పెట్టి ఏడవక్కరలేదు. స్టేట్ మెంట్ రాసిస్తే చాలు. అవునూ ఇంతకీ నువ్వే పార్టీలో వున్నావు ప్రస్తుతం?" అన్నాడు సుబ్బారావు.

సదావివారం కాస్త సిగ్గుపడి "ఇంకా డిసైడ్ చేసుకోలేదు. సార్ ప్రముఖ సంఘ సేవకుడు" అని రాసెయ్యండి అన్నాడు.

"అమ్మ సదావివారం — మొన్న నువ్వేగదా బాబరీ మసీదు కూలగొట్టాలనీ, రామ్మందిరం కట్టాలనీ స్టేట్ మెంటిచ్చావు? రక్తం కూడా చిందిస్తానన్నట్టున్నావు" అన్నాడు కమలనాథం.

సుబ్బారావుకీ గుర్తొచ్చింది.

"అప్పుడా పార్టీలో వున్నా సార్. ఇవాళ పొద్దున్న రాజీనామా చేసేశా. ఇప్పుడీ స్టేట్ మెంట్ వెయ్యకపోతే జనం కొడతారు సార్. పోలీసులు అరెస్ట్ చేస్తారుసార్. పిల్లలవాణ్ణి. దయులతవారి—" అంటున్నాడు సదావివారం.

"మరి రక్తం చిందిస్తానన్నావుగా?" కమలనాథం వొదల్టంలేదు.

"అన్నమాట నిజమేగానీ చిందిస్తానన్నది నా రక్తం కాదుసార్. ఎవరిదో ఒకరిది ఆ టైముకి చిందిచ్చేద్దాంలే అనుకున్నా సార్. అదే పొరపాటై పోయింది సార్. ఇప్పుడు జనం అపార్థం చేసుకుని నా రక్తం చిందించమంటున్నారు".

"నీలాంటి వాళ్ళే కొట్టాల్సిందే. చచ్చినా నీ స్టేట్ మెంటు వెయ్యను" అన్నాడు సుబ్బారావు.

అతనా మాట అనగానే సదావివారం అదృశ్యమైపోయాడు.

"ఎక్కడికి పోయాడు వీడు అంతలోనే" అన్నాడు సుబ్బారావు ఆశ్చర్యంగా.

"పోయినట్టున్నాడు పీడావదిలింది" అన్నాడు కమలనాథం ఏదో వార్త రాసుకుంటూ.

'పోలేదు సార్ ఇక్కడున్నా" అని వినిపించింది టేబులు కింద నించి.

సుబ్బారావు కిందికి చూశాడు. సదావివారం

గట్టిగా సుబ్బారావు కాళ్ళు పట్టేసుకుని వున్నాడు.

"ఏవిటిది లే, లే ఆఫీసులో అసహ్యంగా" అన్నాడు సుబ్బారావు కంగారుగా.

"నా స్టేట్‌మెంట్ వేసేదాకా లేవను సార్. బయటి కెళ్తే నా రక్తం చిందించేస్తారు—" అన్నాడు సదావివారం సుబ్బారావు కాళ్ళని మరింత గట్టిగా వాటేసుకుంటూ.

సుబ్బారావు ఇబ్బందిలో పడిపోయాడు. ఇక చేసేది లేక "సరే వేస్తాను — కాళ్ళొదులు" అన్నాడు విరాగ్గా. సదావివారం స్టేట్‌మెంట్ తీసుకోమని కమలనాభానికి పురమాయించాడు.

ఇంతలో గుర్నాథం వొచ్చాడు వొగర్చుకుంటూ. "పాత బస్తీలో కత్తిపోట్లు— కర్ఫ్యూ. ఆరుగురు చచ్చిపోయారు" అన్నాడు కుర్చీలో కూచుంటూ.

"హమ్మయ్యా బానర్ వచ్చేసింది" అన్నాడు సుబ్బారావు నిట్టూరుస్తూ.

"ఆ! పాత బస్తీలో కత్తిపోట్లా నాదో ఖండన రాసుకోండి సార్" అన్నాడు సదావివారం తక్కున.

"ఇదిగో సదావివారం, ఇక్కణ్ణించి అర్జెంటుగా వెళ్ళకపోయావో నిన్ను నేను ఖండిం చెయ్యగల్ను జాగ్రత్త" అని గావుకేక పెట్టాడు సుబ్బారావు.

దెబ్బకి జారుకుని నిజంగానే అదృశ్యమై పోయాడు సదావివారం.

"పీడా వదిలింది" అన్నాడు సుబ్బారావు.

"వుండండి. తొందర పడకండి. కింద చూడనియ్యండి" అని కిందంతా జాగర్తగా పరిశీలించి కమలనాభం పోయాడు, ఈసారి నిజంగానే పీడవదలింది " అన్నాడు.

ఎడిటర్ త్రయంబకం వచ్చి వార్తలేవిటని వాకబు చేశాడు. గుర్నాథం కత్తిపోట్ల గురించి చెప్పాడు.

"మత సామర్యస్యానికి శతాబ్దాలుగా పేరొందిన హైదరాబాద్ నగర పాతబస్తీలో కత్తిపోట్లు జరిగాయి" అని లీడ్ రాయాలి దీనికి అన్నాడు త్రయంబకం.

"పోయిన్నెల కత్తిపోట్లు జరిగినప్పుడూ, అంతక్రితం నెల జరిగినప్పుడూ కూడా అలాగే రాశాం సార్"

"ఇప్పుడు అలాగే రాయాలి. ఇప్పుడే కాదు ఎప్పుడు కత్తిపోట్లు జరిగినా అలాగే రాయాలి. అది మన పేపర్ పాలసీ" అనేసి వెళ్ళిపోయాడు త్రయంబకం.


"నెల నెలా రివాజుగా జరుగుతున్నాయి. అయినా శతబ్దాలుగా మత సామరస్యానికి పేరు పొందిన హైదరాబాద్ అని రాయాలట. నా చిన్నప్పట్నించీ వింటున్నా ఎప్పుడూ ఇక్కడ గొడవలే" అన్నాడు కమలనాభం.

"ఇలాంటిది నీకు అర్థం కావులే. అనుభవం చాలదు" అన్నాడు సుబ్బారావు.

ప్రతిపక్ష నాయకుడు తారకరావు స్టేట్‌మెంట్ పంపించాడు.

అందులో కూడా శతాబ్దాలుగా మత సామరస్యానికి పేరుపొందిన హైదరాబాదులో కత్తులతో పొడుచుకోడం తనకి నచ్చలేదని, బాబరీ మసీదుని వెంటనే పీవీ నరసింహరావు కట్టాలనీ, లేకపోతే తనే బాబరీ మసీదు కట్టవలిసొస్తుందనీ తారకరావు హెచ్చరించాడు.

"వీడొకడు రోజూ దేన్నో ఒకదాన్ని ఖండిం




చందే వీడికి తోచదు. పీవీ నర్సింహరావు కట్టపోతే వీడేకట్టేస్తాట్ట బాబరీ మసీదు" అని భారంగా నిట్టూర్చాడు సుబ్బారావు.

"మనది చాలా మంచి దేశం. ఈ పొలిటీషియన్లు లేకపోతే చాలా బావుండేది" అన్నాడు సుబ్బారావు దిగులుగా.

ఈలోగా ఫోను మోగింది.

త్రయంబకం మనవడు ఫోన్‌చేసి, 'కర్ఫ్యూ పండగ ఈసారి ఎన్నాళ్ళు డిక్లేర్ చేశారని అడుగుతున్నాడు.

ప్రతినెలా కర్ఫ్యూ పేరు మీద శలవులిస్తుంటే దసరా పండగలాగా అదో పండగ అనుకుంటున్నాడు మూడో తరగతి చదువుతున్న ఆ అబ్బాయి.

"మా నాయనే అచ్చం మీ తాతగారి తెలివితేటలన్నీ నీకొచ్చేశాయి" అన్నాడు సుబ్బారావు ఆనందంగా.

"ఎవరది?" అన్నాడు గుర్నాథం.

"మన ఎడిటర్ గారి మనవడు. కర్ఫ్యూ అంటే నెల నెలా వచ్చే అదో రకం పండగ అనుకుంటున్నాడు. ఈసారి పండక్కి ఎన్ని రోజులు శెలవిస్తున్నారని అడుగుతున్నాడు."

గుర్నాథం జుట్టు పీక్కున్నాడు.

"ఈసారి పండగ బాగా ఘనంగానే జరుగుతోంది బాబూ. శలవులు వారం రోజులదాకా వుండచ్చు" అన్నాడు సుబ్బారావు.

అవతల్నించి పెద్ద చప్పుడైంది.

"ఏవైంది" అన్నాడు సుబ్బారావు కంగారుగా.

"ఏం లేదు అంకుల్., ఎగిర గంతేశా" అని ఫోను పెట్టేశాడు త్రయంబకం మనవడు.

"ఈ కథలో నీతి ఏవిటి?" అని అడిగాడు.

"బాబరీ మసీదును కూలగొట్టినచో త్రయంబకం తన ఎడిటోరియల్ ద్వారా ప్రజలకు తగిన శాస్తి చేయును. సదావివారం పార్టీ ఫిరాయించును. త్రయంబకం మనవడు ఆనందంతో గంతులు వేయును. కర్ఫ్యూని పండగగా అపార్థం చేసుకొనును" అన్నాడు గుర్నాథం.

●